క్లుప్తంగా

కేరళ తరహాలో భూములకు పరిహారం ఇప్పించాలి

గ్రామ సభలో ఆర్డీవోను కోరిన రైతులు



ప్రత్తిపాడు: కేరళ రాష్ట్రం తరహాలో భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం ఇప్పించాలని గుంటూరు ఆర్డీవో కె.శ్రీనివాసరావును రైతులు కోరారు. గుంటూరు చానల్ పొడిగింపుకు భూ సేకరణ ప్రక్రియలో భాగంగా గురువారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని పంచాయతీ కార్యాలయం వద్ద తహసీల్దార్ జి.సుజాత ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వారి సమస్యను ఏకరువు పెట్టారు. ప్రభుత్వం రెండున్నర రెట్లు పరిహారంగా చెల్లిస్తుందని అధికారులు తెలిపారు. స్పందించిన రైతులు మూడు రెట్లు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. అందుకు అధికారులు చట్టప్రకారం రెండున్నర రెట్లు మాత్రమే పరిహారం చెల్లించేందుకు అవకాశం ఉందని వివరించారు. దీంతో రైతులు కేరళలో మూడు రెట్లు చెల్లించినట్లు చెబుతున్నారని, ఒక్కసారి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మూడు రెట్లు పరిహారం చెల్లించేలా చూడాలని రైతులు ఆర్డీవోను కోరారు.

జొన్నలగడ్డ గ్రామంలో స్వామిత్వ సర్వే



గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ అన్ ట్రూతింగ్ కార్యక్రమంలో రోవర్‌తో జరుగుతున్న అంశాలను పరిశీలించారు. సర్వేలకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఓ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం




చేబ్రోలు: బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి ఊర్మిళాదేవి అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఊర్మిళాదేవి మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాల వల్ల శారీరకంగా అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మరో వైద్యాధికారి శైలజ మాట్లాడుతూ విద్యార్థులు చదువు ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

పెదకాకాని: గంజాయి అమ్మకాలు చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని గ్రామంలోని జాన్‌హస్పరస్ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని గత కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ముందస్తు సమాచారం మేరకు పెదకాకాని సీఐ టి.పి.నారాయణ స్వామి, తహసీల్దార్ కె.కృష్ణకాంత్, సిబ్బందితో అక్కడికి చేరుకుని తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ముగ్గురు వైజాగ్ ప్రాంతం నుంచి గంజాయి తెచ్చి చిన్న చిన్న ప్యాకెట్‌లుగా తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అలాగే నలుగురు గంజాయి తాగుతున్నట్లు విచారణలో వెల్లడైంది. గంజాయి అమ్మకాలు చేస్తున్న గంగవరపు సాయి, మేకపాటి తేజస్, వేగి సూరిబాబును గురువారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు సీఐ నారాయణస్వామి తెలిపారు. గంజాయి తాగుతున్న నలుగురు మైనర్లకు కౌన్సెలింగ్‌తో పాటు నోటీసులు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

మతిస్థిమితం లేని బాలుడు అదృశ్యం



లక్ష్మీపురం: మతి స్థిమితం లేని బాలుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రమౌళినగర్‌కు చెందిన చింతమనేని మురళీకృష్ణ అనే బాలుడికి పుట్టుకతోనే మతిస్థిమితం లేక పోవడంతో చికిత్స పొందుతున్నాడు. అయితే గురువారం ఉదయం 11 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. దీంతో బాలుడి తండ్రి శ్యామ్ చుట్టు పక్కల వెతకగా జాడ తెలియకపోవడంతో పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు సీఐ వెంకటేశ్వర్లు 8688831343, ఎస్సై తరంగిణి 8688831614, బాలుడి తండ్రి శ్యామ్ 897856221 నంబర్లకు తెలియజేయాల్సిందిగా కోరారు.

లక్ష్యాలు విధించారు.. బిల్లులు మరిచారు

- బకాయిలు అందక ఉపాధి వేతనదారుల అవస్థలు
- ఉపాధి వేతనాలు చెల్లింపుల్లో జాప్యం
- నెలల తరబడి కార్మికుల ఎదురుచూపులు



కాలువల్లో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

పొన్నూరు: బకాయి వేతనాలు అందక ఉపాధి వేతనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేసి పస్తులుండే పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని పేదలు వాపోతున్నారు. జూన్ నెల నుంచి చెల్లింపులు లేవని చెబుతున్నారు. చేసిన పనులకు రెండు వారాలకు ఒకసారి బిల్లులు చెల్లించాలని చట్టంలో ఉంది. అయినా ఆ దిశగా చర్యలు లేవు. రూ.లక్షల్లో బకాయిలు పేరుకుపోయాయి.

పొన్నూరు మండలంలో...

చెరువులు, కాలువలు, నీటి కుంటలు, హార్టికల్చర్ తదితర పనులు చేశారు. ఖరీఫ్‌కు పొలాలకు సక్రమంగా నీరు అందాలనే ఉద్దేశంతో కాలువల్లోని పూడికతీత పనులు చేపట్టారు. లక్ష్యాలు విధించి పనులు చేయించిన అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించడం మరిచారు. ఖరీఫ్‌లో పనులు కూడా నిలిచిపోయాయి. కార్మికులు మండల పరిషత్ అధికారులకు వినతులు ఇచ్చినా.. ఫలితం లేకుండా పోయింది. మండలంలో 4,500 జాబ్ కార్డులకు గాను 22,500 పనిదినాలు పని చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వారికి మూడు నెలలకు గాను సుమారు రూ.45 లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. నెలల తరబడి వేతనాలు రాక వేతనదారులు అవస్థలు పడుతున్నారు.

బకాయిల కోసం ఎదురుచూపులు

జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన వేతనాలు అందక వేరే పనులు లేక కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారుతోందని ఉపాధి వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో ఇతర ఏ పనులూ ఉండడం లేదని, బకాయి వేతనాలు అందితే ఇబ్బందులు తీరతాయని అంటున్నారు. గ్రామీణ ప్రాంతాలు కావడంతో కూలీ డబ్బులపైనే ఆధారపడుతున్నామని చెబుతున్నారు. వేతన చెల్లింపులలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో వేతనదారులు వేతనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

త్వరలోనే జమ



ఉపాధి వేతనదారులకు చెల్లించాల్సిన బకాయిలు ప్రభుత్వం నుంచి విడుదలయ్యాయి. త్వరలోనే వేతనదారుల బ్యాంకు ఖాతాల లో బకాయి వేతనాలు జమ అవుతాయి.

– మల్లికార్జునరావు, ఈవోపీఆర్‌డీ, మండల పరిషత్, పొన్నూరు

మురికి నీరే తాగునీరు

- వెంగళాయపాలెం లక్ష్మీనరసింహపురంలో వర్షం పడితే బురదనీరే దిక్కు
- పైపుల లీకులు మరమ్మతులు చేయాలని కోరుతున్న ప్రజలు



పంచాయితీ ట్యాప్‌లనుంచి వస్తున్న మురికి నీరు

గుంటూరు రూరల్: చినుకు పడిందంటే పంచాయితీ టాప్‌ల నుంచి మురికి నీరు వస్తుంది. తాగేందుకు, ఇతర అవసరాలకు వినియోగించుకునేందుకు ఇబ్బందిగా ఉందని వెంగళాయపాలెం గ్రామంలోని లక్ష్మీనరసింహపురం కాలనీవాసులు వాపోతున్నారు. గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న నీటి పైప్‌లైన్‌లు ఎక్కడో లీకై వర్షం కురిసిన ప్రతి సారి మురుగు నీరు వస్తుందని, సుమారు అరగంట నీరు వృధాగా పోయిన తరువాత కొద్దిపాటి మంచినీరు వస్తుందని కాలనీ వాసులు అంటున్నారు. వర్షం పడని సమయాల్లో సైతం డ్రైనేజీల నీరు కలిసి వస్తుందని అంటున్నారు. అసలే వాతావరణ పరిస్థితులు తదితర ఇబ్బందులతో గ్రామంలో జ్వరాల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పంచాయతీ అధికారులు గ్రామ ప్రజలకు సరఫరా చేసే తాగునీటి లీకులను పరిశీలించి మురుగు నీరు కలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎంపీడీవోలకు ముందస్తు నోటీసులు అందించిన సచివాలయ ఉద్యోగులు



ప్రత్తిపాడు ఎంపీడీవో శివపార్వతికి నోటీసు అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు



పెదనందిపాడు ఎంపీడీవో లక్ష్మీదేవికి నోటీసు అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రత్తిపాడు: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ బి.రోజా ప్రకాష్ అన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ప్రత్తిపాడు, పెదనందిపాడు, గుంటూరురూరల్ మండలాల ఎంపీడీవోలు కె.శివపార్వతి, లక్ష్మీదేవి, బండి శ్రీనివాసరావులకు ఆయా మండలాల సచివాలయ ఉద్యోగులు ముందస్తు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ బి.రోజా ప్రకాష్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభించాయన్నారు. ఉద్యోగాలు వచ్చి ఐదు సంవత్సరాలు గడిచినా, వివిధ రకాల ఆర్థిక అంశాలకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. అంతేకాకుండా సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి అధికమవుతుండటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే ఉద్యోగులకు రావలసిన నోషనల్ ఇంక్రిమెంట్లు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని కఠినతరం చేస్తామని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో జేఏసీ నాయకులు, మండలంలోని పలు శాఖల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వార్షిక వేడుకలకు అందని ఆహ్వానం

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన 49వ వార్షిక వేడుకలకు గతంలో ఇక్కడ పనిచేసిన వీసీలను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. అయితే ఇదే యూనివర్సిటీలో వీసీగా పనిచేసిన ఆచార్య పి.రాజశేఖర్, కె.వి.యన్నారావులకు ఎటువంటి ఆహ్వానం అందలేదు. వారు పనిచేసిన కాలంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అభివృద్ధికి తోడ్పాటునందించడంతోపాటు విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. వర్సిటీలో ఆడంబరంగా నిర్వహించిన 49వ వార్షిక వేడుకకు మాజీ వీసీలను ఆహ్వానించడంలోనూ పక్షపాతం చూపించారని పలువురు విద్యావేత్తలు, మేధావులు ఆరోపిస్తున్నారు. మాజీ వీసీలను ఆహ్వానించ లేదన్న ఆరోపణలపై వర్సిటీ దూర విద్యా కేంద్రం డైరెక్టర్, వార్షిక వేడుకల మీడియా కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా మాజీ వీసీలకు ఆహ్వాన పత్రికలు అందించే బాధ్యత తనది కాదని రిజిస్ట్రార్ చూశారని పేర్కొన్నారు. దీనిపై వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వీసీ ఆచార్య కె.గంగాధరరావును వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా ఇరువురు స్పందించ లేదు.

తురకపాలెం బాధితులకు మెరుగైన చికిత్స అందించాలి

నెహ్రూనగర్: గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో విజృంభించిన జ్వరాలతో పలువురు మృతి చెందడం బాధాకరమని దళిత, బహుజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను కలిసి వారికి అందుతున్న చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే వారికి జ్వరాలు వస్తున్నాయని సూపరింటెండెంట్ తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించి, భరోసా కల్పించాలని కోరారు. మానవత పరిచర్య సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు, బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు, విప్పర్ల ముత్తయ్య, నల్లపు నీలాంబరం, పాటిబండ్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలతో గులాబి పురుగుల నివారణ

కేంద్రియ సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి వీరయ్య చౌదరి



పత్తి పంటను పరిశీలిస్తున్న ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి వీరయ్య చౌదరి, ఏవో సుగుణ బేగం

ప్రత్తిపాడు: లింగాకర్షక బుట్టలతో గులాబి రంగు పురుగుల ఉధృతిని నివారించవచ్చని కేంద్రియ సస్య రక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి కె.వీరయ్య చౌదరి అన్నారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో గురువారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి కె.వీరయ్య చౌదరి, మండల వ్యవసాయ అధికారి షేక్ సుగుణ బేగంతో కలిసి పత్తి పంట పొలాలను పరిశీలించారు. పత్తి పొలంలో గులాబి రంగు పురుగుల ఉధృతిని గమనించి నివారణకు తీసుకోవలసిన చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు. ఎకరానికి 8 నుంచి 10 లింగాకర్షక బుట్టలను పత్తి పొలాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. లింగాకర్షక బుట్టలను వారానికి ఒకసారి గమనించాలని చెప్పారు. నల్ల, ఎర్ర నేలల్లో నీటి పారుదల కింద పత్తి సాగుచేసిన పొలాల్లో గులాబి రంగు పురుగును గుర్తిస్తే దశల వారీగా 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప నూనె 5 మి.లీ. లీటరు లేదా ఫఫోఫినోపస్ 2 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా క్వినాల్‌ఫాస్ 2.5 మి.లీ. లేదా క్లోరోపైరీఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలుపుకుని దశల వారీగా పురుగు ఉధృతిని బట్టి పిచికారీ చేసుకోవాలన్నారు. ఏవో షేక్ సుగుణ బేగం మాట్లాడుతూ ఎరువుల గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎరువులు సరిపడ అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు పొందాలి

తహసీల్దార్ జియావుల్‌హక్



మాట్లాడుతున్న తహసీల్దార్ జియావుల్‌హక్

పొన్నూరు: 18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ త్వరలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు అవకాశం ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతి బీఎల్వో ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితా ప్రకారం ఓటర్లు ఉన్నారా.. లేక శాశ్వతంగా వలస వెళ్లారా అనే వివరాలను నమోదు చేస్తారని తెలిపారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను తొలగించడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు, చిరునామా మార్పులు, ఓటును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ చేసుకునే అవకాశం కూడా ఉందని చెప్పారు. ప్రతి రాజకీయ పార్టీ పోలింగ్ బూత్ పరిధిలో ఒక బీఎల్ఏను నియమించుకొని వారి వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. బీఎల్వోతో పాటు బీఎల్ఏ కూడా ఇంటింటి సర్వేలో పాల్గొన్నట్లయితే ఓటర్ల జాబితా నూరు శాతం పారదర్శకంగా తయారు చేసే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, ఆర్ఐ శ్రీనివాస్, ఎన్నికల ఆపరేటర్లు లాలు, సిరాజ్, రాజకీయ పార్టీల నాయకులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ, నాయకులు గోపిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

క్వాంటం వ్యాలీ హ్యాకథాన్‌లో ఏఎన్‌యూ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు తదితరులు

పెదకాకాని(ఏఎన్‌యూ): ఏఎన్‌యూ విద్యార్థులు క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ 2025 పోటీల్లో ప్రతిభ కనబరచడం అభినందనీయమని వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వైస్ చాన్సలర్ పేషీలో గురువారం క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ నెల 10వ తేదీన విజయవాడ ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల రీజనల్ సెంటర్లో జరిగిన పోటీల్లో ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఒక టీం, ఎంసీఏ నుంచి ఒక టీం పాల్గొన్నాయి. కాగా ఇంజనీరింగ్ కళాశాల టీం రూ.5,000 క్యాష్ ప్రైస్ సాధించింది. జనరేషన్ ఆన్ రాండమ్ నంబర్ యూజింగ్ క్వాంటం కంప్యూటింగ్ అనే అంశంపై ప్రజెంటేషన్ చేయగా, ఐబీఎం వారి క్యూఐఎస్ కేఐటీ లైబ్రరీ, ఇటీరియం బ్లాక్ చైన్ రాండం నంబర్‌ను క్రిప్టోగ్రఫీ కోసం ఉపయోగించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ లింగరాజు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వి.రవికుమార్ అభినందించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ ఫైనల్లో కూడా ప్రతిభ కనబరిచి విజయం సాధించి మొదటి బహుమతి సాధించాలని ఆకాంక్షించారు. విజయం సాధించిన టీంలో సైబర్ సెక్యూరిటీ విభాగం నుంచి కాండ్రు శాంతరాజు, ఎం.యాదవేంద్ర, ఎస్.మధుసూదన్‌రావు, కె.గణేష్, కె.శివశంకర్, బి.ఐశ్వర్య పాల్గొన్నారని ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, సీఎస్ఈ, సైబర్ సెక్యూరిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.చైతన్య , ఏఐఎంఎల్, డేటా సైన్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ యు.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పలుకుబడి కలిగిన వారికే యూరియా



చేబ్రోలు సచివాలయం-2 వద్ద లారీ నుంచి ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న యూరియా బస్తాలు

చేబ్రోలు: వ్యవసాయ సాగు చేస్తున్న రైతులకు అవసరమైన యూరియా బస్తాలు అందక అవస్థలు పడుతుంటే పలుకుబడి కలిగిన వారికి యూరియా కాసులు కురిపిస్తుంది. మండల కేంద్రమైన చేబ్రోలు గ్రామ సచివాలయం-2 రైతు సేవా కేంద్రం వద్ద గురువారం యూరియా బస్తాల లారీని కొంతమంది దళారులు పక్కదారి పట్టించటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది మంది రైతులకు అరకొరగా యూరియా, డీఏపీలను అందించారు. పలుకుబడి కలిగిన కొంత మంది స్థానిక సిబ్బందిపై ఒత్తిడి తీసుకువచ్చి ట్రాక్టర్ల ద్వారా యూరియా, డీఏపీ బస్తాలను తరలించటంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. టన్నుల కొద్దీ యూరియా, డీఏపీలను సరఫరా చేస్తున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లోపంతో రైతులకు ఎరువులు భారంగా మారాయి. చేబ్రోలు మండల ఏవో ప్రియదర్శిని మాట్లాడుతూ చేబ్రోలు-2, 3 రైతు సేవా కేంద్రాలు, శేకూరు గ్రామాలకు ఈ రోజు యూరియా, డీఏపీలు సరఫరా చేసినట్లు తెలిపారు. ఆధార్, పాసుపుస్తకం ఉన్న రైతులకు మాత్రమే బస్తా చొప్పున ఎమ్మార్పీ ధరకు అందించినట్లు తెలిపారు. ఎరువుల కొరత లేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏవో తెలిపారు.

స్మార్ట్ కార్డులను ప్రభుత్వమే ఇంటింటికి ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ



లక్ష్మీపురం: రేషన్ కార్డుల తప్పులను ప్రభుత్వమే సరిచేయాలేగానీ, ప్రజలపై భారం మోపడం సరికాదని, పాత రేషన్ కార్డుల స్థానంలో ఇచ్చే స్మార్ట్ కార్డులలో తప్పులను ప్రభుత్వమే ఉచితంగా సరిచేయాలని, కార్డులను ఇంటింటికీ పంపిణీ చేస్తామని చెప్పిన హామీని నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. పాత గుంటూరులోని సుందరయ్య భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు తీసుకునిరావడం మంచి విషయమే అయినప్పటికీ ఈ కార్డులో వచ్చిన తప్పులకు ప్రభుత్వానిదే బాధ్యత కాబట్టి వాటిని ఉచితంగా సరిచేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం స్మార్ట్ కార్డులు సచివాలయ అధికారులు ఇంటికి వచ్చి ఇస్తారని చెప్పిందనీ, కానీ ఆచరణలో అమలు జరగడం లేదని, ఇది అమలు జరిగే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.లక్ష్మణరావు తదితరలు పాల్గొన్నారు.





బడికెళ్లే ఆటోలో భద్రత ఉందా..?!

ప్రత్తిపాడు: ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించే బడి పిల్లల భద్రత గాలిలో దీపంలా మారింది. రక్షణ లేని సురక్షితం కానీ కనీస ప్రమాణాలు పాటించని ఆటోల్లో విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణిస్తూన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు సైతం పిల్లలను ఆటోల్లోనే పాఠశాలలకు పంపుతూ వారిని ప్రమాదపుటంచులకు చేరవేస్తున్నారు. అలాంటి చిత్రాలే ఇవి. ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, ప్రాథమిక పాఠశాలకు సమీపంలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. అయితే ఈ మార్గంలో విద్యార్థులకు ఆర్టీసీ బస్సు నడపాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు అనేక సార్లు ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులను కోరినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. విధి లేని పరిస్థితుల్లో ఇదిగో నిత్యం విద్యార్థులు ఇలా ఆటోల్లో ముందూ, వెనుక వేళ్లాడుతూ ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారు. ఆ చిత్రాలే ఇవి.

సర్వేల నుంచి మినహాయించండి



నెహ్రూనగర్: సర్వేల నుంచి సచివాలయ ఉద్యోగులకు విముక్తి కలిగించాలని జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు షేక్ అబ్దుల్ రజాక్ విన్నవించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక పిలుపు మేరకు గురువారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులను కలిసి ఉద్యమ కార్యాచరణ నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సర్వేల నుంచి విముక్తి కలిగించాలని, వారిని మాతృ శాఖలకు అప్పగించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, రావాల్సిన బకాయిలు ఇవ్వాలని, స్పష్టమైన సర్వీస్ రూల్స్ రూపొందించి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ అప్‌గ్రేడ్ చేయాలని, బదిలీలకు స్పష్టమైన విధివిధానాలతో జీవో ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా నోటీసులను క్షేత్రస్థాయి అధికారులకు అందజేస్తున్నామని జేఏసీ నాయకులు తెలిపారు. నాయకులు ధనలక్ష్మి, మధులత, సందీప్, అనురాధ, మధు, సతీష్, హరికృష్ణ, నజీర్, సుభాని, మహేష్, శేషగిరి, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శ్రీరామాంజనేయ యుద్ధం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై గురువారం శ్రీరామాంజనేయ యుద్ధం వార్‌సీన్ పద్య నాటకం ప్రదర్శించారు. పీవీ శంకరరావు ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయపాలక మండలి, అతిథులు జ్యోతి ప్రజల్వనతో ప్రారంభించారు. శ్రీరాముడిగా బిళ్లా జాన్‌బాబు, ఆంజనేయుడిగా వెనిగళ్ల బ్రహ్మం చక్కని హావభావాలతో పద్యాలను అలపించారు. హార్మోనియంపై పి.సురేష్, క్లారినట్‌పై వి.వెంకట్రావు, డోలక్‌పై శ్రీనివాస్, మేకప్ పి.రాము అందించారు. అనంతరం కళాకారులు సత్కరించారు.